క్లుప్తంగా

విజయగణపతికి ప్రత్యేక పూజలు


విజయగణపతికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

విజయనగరం రూరల్: మండలంలోని సారిక గ్రామ పంచాయతీలో కొలువుదీరిన శ్రీరామనారాయణం ఆలయ ప్రాంగణంలో ఉన్న విజయగణపతికి ఆలయ ప్రధాన అర్చకులు చాణక్యశర్మ ప్రత్యేక పూజలను నిర్వహించారు. మంగళవారం హస్త నక్షత్రం పురస్కరించుకుని పంచామృతాభిషేకాలతో పాటు నాగ దేవతకు పాలాభిషేకాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు నారాయణం సీతారామయ్య, పద్మశ్రీ దంపతులు పాల్గొన్నారు.

రక్తదానం


రక్తదానం చేస్తున్న యోగి

విజయనగరం ఫోర్ట్: నరాల సంబంధిత శస్త్రచికిత్సకు రక్తం అవసరం అయిన ఓ మహిళకు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో పని చేస్తున్న ఓ ఉద్యోగి రక్తదానం చేసారు. మెంటాడ మండల కేంద్రానికి చెందిన పి.శ్రావణి అనే మహిళ గత కొంత కాలంగా నరాల సంబంధిత వ్యాధితో బాధపడుతుంది. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో కొద్ది రోజులు క్రితం వైద్యులకు చూపించగా శస్త్రచికిత్స చేయాలని నిర్ధారించారు. శస్త్రచికిత్స నిమత్తం ఓ పాజిటివ్ ఒక యూనిట్ రక్తం ఎక్కించాలని వైద్యులు సూచించారు. దీంతో ఆస్పత్రిలోని ఓపీ విభాగంలో పని చేస్తున్న నడుపూరు యోగి అనే ఉద్యోగిని ఆశ్రయించగా అతను సర్వజన ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్‌కు వెళ్లి రక్తం దానం చేసారు.

ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ బీఆర్ అంబేద్కర్ తదితరులు

విజయనగరం అర్బన్: జాతీయ ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం 50వ ఆవిర్భావ దినోత్సవాల పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు ఆరిక చంద్రశేఖర్‌తో పాటు ఇతర నాయకులు ఈ.రామకృష్ణ, డి.సీతారాం, ఆర్ఎస్‌వీదొర, డి.సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 26, 27 తేదీల్లో భద్రాచలంలో ఆవిర్భావ దినోత్సవం జరుగుతుందని సంఘ నాయకులు తెలిపారు.

అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించాలి


గుషిణిలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నెల్లిమర్ల రూరల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అవమానకర వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను తక్షణమే మంత్రి పదవి నుంచి తొలగించాలని జై భీమారావు పార్టీ నాయకులు జిల్లా ప్రధాన కార్యదర్శి కనిగిరి శ్రీను డిమాండ్ చేశారు. మండలంలోని గుషిణి గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ద్వారా ఎన్నుకోబడిన అమిత్‌షా అంబేద్కర్‌ను తక్కువ చేసి మాట్లాడడం బాధాకరమన్నారు. అమిత్‌షా తక్షణమే క్షమాపణలు చెప్పాలని, భవిష్యత్తులో పునరావృతం కాకుండా బీజేపీ అధిష్టానం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత నాయకులు దిలీప్, త్రినాధ్, మనోహర్, శివ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ కేరల్స్


గంటస్తంభం వద్ద క్రిస్మస్ కేరల్స్ నిర్వహిస్తున్న యేసు ప్రేమాలయం చర్చి నిర్వాహకులు

విజయనగరం టౌన్: స్థానిక అంబటిసత్రం వద్ద యేసు ప్రేమాలయం ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం క్రిస్మస్ కేరల్స్ కార్యక్రమాన్ని పాస్టర్ అలజంగి రవికుమార్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చర్చి ఆవరణలో ప్రత్యేక ప్రార్థనల అనంతరం క్రీస్తు ఆరాధకులు పట్టణంలోని వీధుల్లో భారీ ఊరేగింపు నిర్వహించి, క్రీస్తు గీతాలాపన చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ రవికుమార్ మాట్లాడుతూ యేసు ప్రేమాలయం ద్వారా మూడు రోజులుగా ఊరేగింపు కేరల్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పలువురు క్రైస్తవులు పాల్గొన్నారు.



140 ఏళ్ల చరిత్ర కలిగిన ఆర్‌సీఎమ్ చర్చి


ఆధ్యాత్మిక నిలయాలు... క్రీస్తు ఆలయాలు

- శతాబ్దాల చరిత్ర కలిగిన దేవాలయాలు
- నేటికీ చెక్కు చెదరని వైనం

140 ఏళ్ల చరిత్ర కలిగిన ఆర్‌సీఎమ్ చర్చి

జిల్లా కేంద్రంలోని ఆర్‌సీఎమ్ సెయింట్ ఆంథోనీస్ చర్చికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. 1880 డచ్ నుంచి వచ్చిన మత గురువు పాదర్ మారీస్ ఇక్కడ చర్చిని స్థాపించారు. 140 ఏళ్ల చరిత్ర ఈ దేవాలయానిది. అతి పురాతనమైనప్పటికీ నేటికీ నిత్యనూతనంగా కనిపిస్తోంది. పేద విద్యార్థుల కోసం ఇక్కడ పాఠశాలను స్థాపించారు. క్రైస్తవులే కాదు క్రైస్తవేతరులే ఇక్కడ ఎక్కువగా విద్యనభ్యసిస్తున్నారు. ప్రతీరోజూ దైవారాధనలు చేస్తారు. క్రిస్మస్ సందర్భంగా ఇక్కడ ప్రత్యేక ప్రార్థనలు జరుగుతాయి. ఇదే చర్చికి పక్కన నిర్మించిన కొత్త చర్చిలోనే పండగ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసారు. 25న బుధవారం ఉదయం 8 గంటల నుంచి క్రిస్మస్ ప్రార్థనలు, క్రీస్తు గీతాలాపనలు వంటి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

వందేళ్ల సెయింట్ మేరీస్ చర్చి


చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియాలో ఒకటిగా పేరొందిన సెయింట్ మేరీస్ చర్చి

జిల్లా కేంద్రంలోని కంటోన్మెంట్‌లో ఉన్న సెయింట్ మేరీస్ చర్చికి వందేళ్ల చరిత్ర ఉంది. 1906లో బిషప్ ఆఫ్ మద్రాస్ హెన్రీ వైట్‌హెడ్ దీన్ని ప్రారంభించారు. 1947లో చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియాలో ఇదోక భాగంగా ఆవిర్భవించింది. కృష్ణా, గోదావరి (కోస్టల్ ఆంధ్రా) డయాసిస్‌లో ఇదోక చర్చిగా గుర్తింపు పొందింది.


పశువుల పాకలో క్రీస్తు జననం

అతిపెద్ద దేవాలయం

గుంటూరు నుంచి ఇచ్ఛాపురం వరకూ ఉన్న అతి పెద్ద దేవాలయం కంటోన్మెంట్ బాప్టిస్ చర్చి కావడం విశేషం. 1961లో ఈ చర్చి ప్రారంభమైంది. పాత ఆలయం స్థలంలో కొత్తగా నిర్మాణం చేపట్టారు. ఇప్పుడు అతిపెద్ద దేవాలయంగా పేరుంది.

సిమ్స్ మెమోరియల్ బాప్టిస్ చర్చి


సిమ్స్ బాప్టిస్ట్ చర్చ్

జిల్లా కేంద్రంలో ప్రథమ బాప్టిస్ట్ సంఘం 1875 సెప్టెంబర్ 10న స్థాపించబడింది. చాలాకాలం తెలుగు బాప్టిస్ట్ సంఘమని పిలవబడింది. స్థానిక ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ పక్కనే ఉన్న సిమ్స్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చి ఉంది. దీని అభివృద్ధికి 1910లో సిమ్స్ దొర రూ.2వేల డాలర్లను అందజేశారు. ప్రస్తుతం ఈ చర్చి ఆధునీకరించబడింది. కార్యదర్శిగా, సంఘమిత్ర ఆర్ఎస్.జాన్ కొనసాగుతున్నారు.

ప్రజల జీవితాల్లో వెలుగులు నింపారు



క్రీస్తు జననం ప్రపంచానికి ఒక ఆశీర్వాదం. ఆయన పుట్టినందున ప్రపంచ ప్రజలందరికీ గొప్ప రక్షణ, సంతోషం, సమాధానం, ఆనందం కలుగజేశారు. ప్రేమామయుడు ఏసుక్రీస్తు. ఈ లోకంలో ఉన్న మానవజాతికి ప్రేమ, క్షమాపణ, త్యాగం, కరుణ, దయా గుణములు నేర్పించారు. ఆయనను నమ్ముకున్న వారందరికీ మోక్షం కలుగుతుంది.

–డాక్టర్ పి.ప్రేమానందం, ఏబీసీసీ జిల్లా అధ్యక్షుడు, విజయనగరం

27న విద్యుత్ చార్జీల బాదుడుపై పోరుబాట

- మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు


బడ్డుకొండ అప్పలనాయుడు

పూసపాటిరేగ : విద్యుత్ చార్జీల బాదుడుపై వైఎస్సార్‌సీపీ ఈ నెల 27న తలపెట్టిన పోరుబాటను విజయవంతం చేయాలని నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు పిలుపునిచ్చారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి సర్కార్ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని కోరారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను అమాంతంగా పెంచడంతో నిరుపేదలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. పోరుబాట కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులతో పాటు ప్రజలు తరలి రావాలని పిలుపునిచ్చారు.

బతుకు చిత్రం



వాతావరణంలో మార్పులు ఫుట్‌పాత్ వ్యాపారులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. రెక్కాడితేగాని డొక్క నిండని ఫుట్‌పాత్ వ్యాపారులు విజయనగరంలో మంగళవారం కురిసిన వర్షంతో ఇబ్బందులు పడ్డారు. ఫుట్‌పాత్‌పై జొన్నపొత్తులు విక్రయిస్తూ బతుకు జీవనాన్ని కొనసాగిస్తున్న ఓ మహిళ ఇలా జొన్నపొత్తుల చుట్టూ చేరిన వర్షపు నీటిని పక్కకు ఊడుస్తూ తన జొన్నపొత్తులను కాపాడుకునే ప్రయత్నం చేస్తూ ఇలా సాక్షి కెమెరాకి చిక్కింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

రైతుబజార్ల ఎస్టేట్ అధికారులకు బదిలీ

విజయనగరం ఫోర్ట్: ఆర్అండ్‌బీ రైతు బజార్ ఎస్టేట్ అధికారి చప్ప సతీష్‌కుమార్‌కు ఎం.ఆర్. రైతు బజార్‌కు, అక్కడ ఎస్టేట్ అధికారి ఉమమహేశ్వరావుకు రింగ్ రోడ్ రైతు బజార్‌కు బదిలీ అయింది. రింగ్ రోడ్ రైతు బజార్ ఎస్టేట్ అధికారి అప్పలనాయుడుకు ఆర్అండ్‌బీ రైతు బజార్‌కు బదిలీ అయింది.

మొక్కజొన్న పంట రక్షణకు చర్యలు

- వ్యవసాయ శాస్త్రవేత్త కె.లక్ష్మణరావు


చొల్లంగిపేటలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త లక్ష్మణరావు, ఏడీఏ నాగభూషణం

డెంకాడ: ప్రస్తుతం కురుస్తున్న వర్షాల నేపథ్యంలో మొక్కజొన్న పంట సంరక్షణకు రైతులు తగు చర్యలు తీసుకోవాలని విజయనగరం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త కె.లక్ష్మణరావు సూచించారు. మండలంలో పలు గ్రామాల్లో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను వ్యవసాయాధికారులతో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కజొన్న పొలంలో ఉన్న వర్షం నీటిని బయటకు పంపించే విధంగా బాటలు వేయాలన్నారు. వారం రోజుల వ్యవధిలో ఎకరాకు 2 కేజీల 19-19-19, ప్రోపికొనజాల్ 500ఎంఎల్‌ను కలిపి పిచికారీ చేయాలన్నారు. విజయనగరం ఏడీఏ ఎ.నాగభూషణరావు మాట్లాడుతూ పంటల బీమా చెల్లించేందుకు ఈ నెల చివరి వరకూ వీలుందన్నారు. మొక్కజొన్న వేసిన రైతులు ఎకరాకు రూ.500, పెసర, మినప పంటలు వేసిన రైతులు ఎకరాకు రూ.300 బీమా ప్రీమియం చొప్పున గ్రామ వ్యవసాయ సహాయకులకు చెల్లించాలన్నారు.

నాగేశ్వరరావుకు అబ్దుల్‌కలాం విజ్ఞన్ గురు పురుస్కారం

పూసపాటిరేగ : మండలంలోని గోవిందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు టి.నాగేశ్వరరావుకు అబ్దుల్ కలాం విజ్ఞన్ గురు పురస్కారం లభించింది. విద్యా రంగానికి చేసిన కృషి, సామాజిక సేవలకుగాను గుంటూరులో జరిగిన ఒక కార్యక్రమంలో ఇస్రో శాస్త్రవేత్త పత్రి వేణుగోపాల్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సాంబశివరావు, ఏపీఎన్ ప్రసాదు, ఎస్.రాజశేఖర్, కె.రామమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్య వైశ్యుల అభివృద్ధికి కృషి చేస్తా..

- ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కుసుమంచి సుబ్బారావు


ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ సుబ్బారావును సత్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

విజయనగరం: ప్రభుత్వ సహకారంతో ఆర్య వైశ్యుల ఉన్నతికి, అభివృద్ధికి కృషి చేస్తానని ఆర్య వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కుసుమంచి సుబ్బారావు అన్నారు. మంగళవారం సంఘం కార్యాలయంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో డైరెక్టర్‌గా నియామకమైన సుబ్బారావును సంఘం అధ్యక్షుడు చెరుకూరి నాగరాజు అధ్యక్షతన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను రూపొందిస్తుందన్నారు. అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ సుబ్బారావు డైరెక్టర్ పదవికి వన్నె తెచ్చే వ్యక్తని, వృద్ధుల కోసం సొంతంగా ఆశ్రమం నడిపించడం, పేదలకు ఉపాధి కల్పించడం, సత్సంగాలు పేరిట నిత్యం అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం వారి గొప్పతనానికి నిదర్శనం అని అన్నారు. అనంతరం జిల్లాలోని అన్ని సంఘాలు కలసి సుబ్బారావును ఘనంగా సన్మానించారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తవ్వా మోహనరావు, కార్యదర్శి డిమ్స్ రాజు, కోశాధికారి రామారావు, యువజన సంఘం అధ్యక్షుడు ఆరిశెట్టి సందీప్, బండారు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌హేలర్లు సరఫరా చేసిన ఏపీ ఎంఎస్‌ఐడీసీ అధికారులు


ఆస్పత్రికి వచ్చిన ఇన్‌హేలర్లు చూపుతున్న ఫార్మసీ ఆఫీసర్ నరసింగరావు

సాక్షి ఎఫెక్ట్

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆస్తమా, సీఓపీడీ రోగులు ఉపశమనం పొందేందుకు అవసరమైన ఇన్‌హేలర్లు లేక అవస్థలు పడుతున్న అంశంపై సాక్షిలో నవంబర్ 30వ తేదీన 'ఇన్‌హేలర్‌కే దిక్కులేదు..' అనే శీర్షికన ప్రచురించిన కథనానికి ఏపీఎంఎస్‌ఐడీసీ అధికారులు స్పందించారు. ఆస్పత్రులకు ఇన్‌హేలర్లు సరఫరా చేసారు. సర్వజన ఆస్పత్రికి ఇన్‌హేలర్లు వచ్చాయని ఫార్మసీ ఆఫీసర్ నరసింగరావు మంగళవారం తెలిపారు.

రెవెన్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు


క్రిస్మస్ వేడుకల్లో కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్, జేసీ సేతుమాధవన్

విజయనగరం అర్బన్: జిల్లా రెవెన్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కేక్ కట్ చేసి, క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, డీఆర్‌ఓ ఎస్.శ్రీనివాసమూర్తి, ఎస్‌డీసీలు మురళీకృష్ణ, సుధారాణి, ప్రమీలాగాంధీ, ఆర్‌డీఓ రామ్మోహన్, కలెక్టరేట్ ఏఓ దేవ్ ప్రసాద్, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తాడ్డి గోవింద, వివిధ మండలాల తహసీల్దార్లు, డీటీలు, రెవెన్యూ అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, పాస్టర్లు పాల్గొన్నారు.

వినియోగదారులు రాజీపడొద్దు..


కార్యక్రమంలో మాట్లాడుతున్న భీశెట్టి బాబ్జి

డెంకాడ: వస్తు సేవల్లో లోపం జరిగినా, కల్తీలు, మోసాలు, బోగస్ సంస్థలు మోసగించినా, ఆన్‌లైన్ మోసాలు ఇలా వినియోగదారులకు అన్యాయం జరిగితే రాజీపడకుండా వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేసి న్యాయం పొందవచ్చని జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా మండలంలోని జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజినీరింగ్ కళాశాలలో వినియోగదారుల చైతన్య సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1986 డిసెంబర్ 24న భారత ప్రభుత్వం వినియోగదారుల దినోత్సవాన్ని ప్రకటించి చట్టాన్ని ప్రజల ముందుకు తీసుకువచ్చారన్నారు. వినియోగదారుడికి మరింత మేలు జరగాలని ఆకాంక్షతో 2009లో వినియోగదారుల చట్టాన్ని మరిన్ని సవరణలు చేశారన్నారు. వస్తు సేవల వినియోగంలో వినియోగదారుడు రాజన్నారు. అలాంటి వినియోగదారుడిని మోసం చేస్తే తగిన మూల్యం కూడా చెల్లించక తప్పదన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎన్‌వీఎన్ బ్లడ్ బ్యాంకు అధినేత తాడేపల్లి నాగేశ్వరరావు, వేదిక ప్రతినిధులు రామ్మోహన్, కనకాచారి, విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రత సామాజిక బాధ్యత

- డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ మణికుమార్


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ మణికుమార్

నెల్లిమర్ల రూరల్: రహదారి భద్రతను సామాజిక బాధ్యతగా గుర్తించి జాగ్రత్తగా నడుచుకోవాలని విద్యార్థులకు డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ మణికుమార్ సూచించారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో మంగళవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి భద్రత అందరి బాధ్యతగా ప్రతి ఒక్కరు గుర్తెరగాలన్నారు. ప్రస్తుతం రోడ్డు ప్రమాదాల్లో అధిక శాతం యువతే మృత్యువాత పడుతున్నారన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడంతో పాటు వాహనాలను పరిమిత వేగంతో నడపాలని సూచించారు. ఎంవీఐ రవిశంకర్ ప్రసాద్ రహదారి భద్రతా ప్రమాణాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో వివరించారు. కార్యక్రమంలో వీసీ ప్రశాంతకుమార్ మహంతి, డీన్ డాక్టర్ ఆర్ఎస్ వర్మ పాల్గొన్నారు.

మళ్లీ ముసురుకుంది..!

- అల్పపీడనం ప్రభావంతో రోజంతా వర్షం
- జిల్లా కేంద్రంలో స్తంభించిన జన జీవనం
- మందకొడిగా సాగిన వ్యాపార లావాదేవీలు

విజయనగరం: అకాల వర్షాలు అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపడిన ప్రభావంతో మళ్లీ వర్షాలు ప్రారంభమయ్యాయి. సోమవారం అర్ధరాత్రి నుంచి ప్రారంభమైన వర్షం మంగళవారం రోజంతా కురిసింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులతో పాటు వివిధ పనుల నిమిత్తం నగరానికి వచ్చిన వారంతా అవస్థలు పడ్డారు. వర్షంతో జిల్లా కేంద్రమైన విజయనగరంలో జన జీవనం స్తంభించిపోయింది. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులతో పాటు వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు సైతం వర్షంతో ఇక్కట్లు ఎదుర్కొన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో వివిధ పనుల నిమిత్తం వచ్చిన వారు సైతం ఇబ్బందులు పడ్డారు. నగరంలోని వివిధ ప్రధాన జంక్షన్‌లలో రోడ్లపై వ్యాపారాలు సాగించే చిల్లర వ్యాపారులు తడిసిముద్దయ్యారు. ఉమ్మడి విజయనగరం జిల్లాకు వ్యాపార వాణిజ్య కేంద్రంగా పేరొందిన జిల్లా కేంద్రంలో వ్యాపారాలు సైతం మందకొడిగా సాగాయి.

ఆకట్టుకున్న వల్లీ కల్యాణం హరికథ


హరికథా గానాలాపన చేస్తున్న హరికథా భాగవతారిణి కరాటే కల్యాణి

విజయనగరం టౌన్: ప్రముఖ సినీనటి, హరికథ భాగవతారిణి కరాటే కల్యాణి తన హరికథా గానాలాపనతో భక్తులను అలరించారు. శ్రీ పైడితల్లి అమ్మవారి ఆలయం ఆవరణలో ఆధ్యాత్మిక కళావేదికపై మంగళవారం రాత్రి నిర్వహించిన వల్లీ కల్యాణం హరికథా గానాలాపన చేశారు. వయొలిన్‌పై పి.ఈశ్వరమ్మ, మృదంగంపై శివకుమార్‌లు సహకరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితులు శాస్త్రోక్తంగా పూజాధికాలు చేశారు. అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, ఆర్.సూర్యపాత్రో తదితరులు పాల్గొన్నారు.